TGTEL/2026/A1889

# హైదరాబాద్ మిర్రర్

ప్రతి ఉదయం.. జన హృదయం

ఎడిటర్ & పబ్లిషర్ : మాకం గంగాధర్ సంపుటి : 01 సంచిక :64 04 గురువారం, జూన్ 2026 వేల : 5/-

Circulation : Hyderabad, Rangareddy, Nalgonda, Yadadri Bhuvanagiri, Suryapet, Mahabubnagar, Khammam, Nizamabad, Sangareddy, Adilabad




### కర్నాటక సిఎం డికె
## కీలక నిర్ణయం
విద్యార్థులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం




### తెలంగాణలో భూముల
## విలువల్లో సవరణ
జూన్ 5నుంచి అమల్లోకి రానున్న ఆదేశాలు

మార్కెట్ రేట్ల మేరకు సవరణలు చేశామన్న పొంగులేటి



# భారత సుదర్శన చక్రం ఎస్-400

## భారత్‌కు చేరుకున్నట్లు రక్షణరంగం వెల్లడి

**న్యూఢిల్లీ,జూన్ 3 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి**

రష్యా నుంచి ఎస్-400 సుదర్శన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టం నాల్గవ స్క్వాడ్రన్ భారత్‌కు చేరుకుంది. దీంతో భారత గగనతల రక్షణ మరింత బలోపేతం కానుంది. ఎస్-400 సుదర్శన్ సుదీర్ఘ శ్రేణి ఎయిర్‌డిఫెన్స్ సిస్టం రష్యా నుంచి నౌకలో భారత్‌కు వచ్చినట్టు రక్షణ శాఖ వర్గాలు బుధవారం నాడు తెలిపాయి.

వివరాలు 2లో








# ఆరోగ్యం ఉంటేనే సంపద

సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే

నిజమైన ధనవంతులు

యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదు

21న కృష్ణా తీరంలో యోగా ప్రదర్శనలు

సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి


## తమిళనాడులో కాంగ్రెస్‌కు రాజ్యసభ సీటు
### వెల్లడించిన సిఎం విజయ్



**చెన్నై,జూన్3 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి**

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం తమ కీలక భాగస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్‌కు రాజ్యసభ స్థానం కేటాయించింది. తమిళనాడు నుంచి రాజ్యసభ స్థానానికి జూన్ 18న ఎన్నిక జరుగనుంది. కాంగ్రెస్‌కు రాజ్యసభ సీటును కేటాయించిన విషయాన్ని ముఖ్యమంత్రి విజయ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. 'ఈనెల 18న తమిళనాడులో రాజ్యసభకు ఎన్నిక జరుగనుంది. ఆ రాజ్యసభ సీటును మా భాగస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్‌కు కేటాయించాలని టీవీకే నిర్ణయం తీసుకుంది' అని విజయ్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మైలం నియోజకవర్గం నుంచి ఎన్నికైన రాష్ట్ర మాజీ మంత్రి సీవీ షణ్ముగం తన రాజ్యసభ స్థానానికి మే 7న రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానానికి ఎన్నిక జరుగుతోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూన్ 8వ తేదీ వరకూ రిటర్నింగ్ అధికారి ముందు నామినేషన్లు దాఖలు చేసుకోవలసి ఉంటుంది. 9వ తేదీ ఉదయం 11 గంటలకు నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 11వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. ఒకరు కంటే ఎక్కువ మంది పోటీలో ఉంటే జూన్ 18వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 వరకూ సెక్రటేరియట్‌లో పోలింగ్ నిర్వహిస్తారు.

### నెహ్రూ
# రికార్డుకు మోడీ బ్రేక్
## అత్యధిక కాలం ప్రధానిగా మోడీ



**న్యూఢిల్లీ,జూన్3 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి**

నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించబోతున్నారు. ఈ నెల 10న ఇండియాకు అత్యధిక కాలం పని చేసిన ప్రధానిగా నిలవబోతున్నారు. అది కూడా ఎన్నికల్లో గెలిచి, అత్యధిక రోజులు ప్రధానిగా కొనసాగిన జవహర్ లాల్ నెహ్రూను దాటేయబోతున్నారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ మే 13, 1952న పదవీ బాధ్యతలు చేపట్టారు. మే 27, 1964న ఆయన మరణించేవరకు ప్రధానిగానే ఉన్నారు. అలా మొత్తం 4,398 రోజులు ప్రధానిగా కొనసాగారు. ఇంతకాలం పదిలంగా ఉన్న ఈ రికార్డును మోదీ జూన్ 10న చెరిపేయబోతున్నారు. ఈ నెల 10తో మోదీ ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకుంటారు. మోదీ మొదటిసారిగా మే 26, 2014న ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు.

వివరాలు 2లో



### తెలంగాణ అప్పులపై
# చర్చకు సిద్ధమే

వచ్చే ఏడాది ఖచ్చితంగా పాదయాత్ర చేస్తా

కడుపులో కత్తులు పెట్టుకుని నవ్వుతూ మాట్లాడలేను

మీట్ ద ప్రెస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్,జూన్ 3 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి**

వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు ఈ మేరకు ఆయన సమాధానమిచ్చారు. పాదయాత్ర మొదలయ్యేలోపు ఫిట్ అవ్వాలని చూస్తున్నానని చమత్కరించారు. వచ్చే ఏడాది పాదయాత్ర ఎప్పుడు అనేది పార్టీ నిర్ణయిస్తుందని కేటీఆర్ తెలిపారు. 2027లో కచ్చితంగా పాదయాత్ర ఉంటుందని

వివరాలు 2లో

### రాజకీయాల్లో కులదూషణలు
# దారుణం

అమరజీవి పొట్టి శ్రీరాములుకు కూడా తప్పని కులచట్రం

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన

**అమరావతి,జూన్ 3**

**హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి**



భాష ప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వంటి మహనీయులను కూడా నేడు కుల చట్రాల్లో బంధించడానికి సగటు రాజకీయ ఆలోచనలు చేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

వివరాలు 2లో

### తెలంగాణ, తూరంగియా మధ్య
# కీలక ఒప్పందం

- టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సహకారం
- యువతలో నైపుణ్యాలను తీర్చి దిద్దాలన్న సిఎం రేవంత్



**హైదరాబాద్,జూన్3 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి**

తెలంగాణ, జర్మనీలోని తూరంగియా రాష్ట్రాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, ధురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జర్మనీ తురింగియా రాష్ట్ర సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో సీఎం ఎ. రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల

వివరాలు 2లో

### ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం
# కేంద్రంగా హైదరాబాద్

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026'లో పాల్గొనండి

దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో సిఎం రేవంత్ భేటీ

**హైదరాబాద్,జూన్3**

**హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి**



వివరాలు 2లో

భారత్‌లో పర్యటిస్తున్న దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం, పరిశ్రమలు, పెట్టుబడులు వంటి పలు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై ఇరు పక్షాలు చర్చించాయి. తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ ప్రత్యేకతలను దక్షిణాఫ్రికా ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

# జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి మరో మైలురాయి

హత్నూరలో తెరానిమ్ బయోలాజిక్స్ యూనిట్ ప్రారంభం

హత్నూర మండలం బోరపట్లలో తెరానిమ్ బయోలాజిక్స్ యూనిట్ ప్రారంభం

బయోఫార్మా రంగంలో తెలంగాణకు మరో కీలక ముందడుగు

స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగనున్నాయి

సంగారెడ్డిని బయోటెక్నాలజీ, ఔషధ రంగాల ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా అడుగు

పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలపై సంస్థలకు మంత్రుల సూచనలు



# తెలంగాణ, తూరంగియా మధ్య కీలక ఒప్పందం

మొదటిపేజీ తరువాయి

జర్మనీ తురింగియా రాష్ట్ర సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో సీఎం ఎ. రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని... ముఖ్యంగా ఏఐ ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. సీఎం రేవంత్‌వ్యాఖ్యలకు స్పందించిన... తురింగియా సీఎం మారియో వోయిట్... తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుందని... సీఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అన్నారు. తురింగియా సీఎం మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్వాగతిస్తూ ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సమావేశంలో తురింగియా సీఎం మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ రైజింగ్ – 2047' విజన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత–జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని... ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

మొదటిపేజీ తరువాయి

# ఆరోగ్యం ఉంటేనే సంపద

గుంటూరు,జూన్ 3హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి

ఎంత సంపద ఉన్నా.. ఆరోగ్యం అవసరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులని పేర్కొన్నారు. బుధవారం గుంటూరు జిల్లాలోని తక్కెళ్లపాడులో సీఎం చంద్రబాబు పర్యటించారు. లలిత ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగించారు. వేల కోట్లు, పదవులు ఉన్నా ఆరోగ్యం లేకపోతే లాభంలేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి.. ల్యాండ్‌మార్క్ ఇన్‌స్టిట్యూట్‌గా తయారు కావాలని ఆకాంక్షించారు. ఈ హాస్పిటల్లోని స్కానర్ సౌత్ ఇండియాలోనే లేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి 600 పడకల సామర్థ్యంతో 900 మంది సిబ్బందితో ప్రారంభమైందని సీఎం చంద్రబాబు తెలిపారు. 32 విభాగాలకు వైద్యసేవలు అందించే ఏకైక కేంద్రం ఇదని వివరించారు. ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత ఉంటేనే.. ఏ వ్యవస్థ అయినా మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఆరోగ్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంచి అలవాట్లతోనే ఆరోగ్యం కాపాడుకోవచ్చని చెప్పారు. యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదని పేర్కొన్నారు. మనిషికి ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదని సీఎం చంద్రబాబు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న వారే నిజమైన ధనవంతులని చెప్పుకొచ్చారు. ఆరోగ్యవంతులైన పౌరులు ఆరోగ్యకరమైన దేశాన్ని తయారు చేస్తారని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ బాగా పని చేస్తున్నారని ప్రశంసించారు. సబ్జెక్టు అర్థం చేసుకుని వైద్య ఆరోగ్య శాఖను చక్కగా నిర్వహిస్తున్నారని చెప్పారు. సంజీవని పేరుతో డిజిటల్ హెల్త్ రికార్డు ప్రాజెక్టు తెస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ వైద్య పరిజ్ఞానం తెచ్చి ప్రజలకు ఇస్తామని అన్నారు. వ్యాధులు రాకుండా ఏం చేయాలో, వ్యాధి నిర్ధారణ నివారణకు సంబంధించి అత్యుత్తమ విధానాలు అమలు చేస్తామని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ తెచ్చి రెండున్నర లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తామని స్పష్టం చేశారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు ఏం చేయాలో అన్నీ చేస్తామని.. కానీ అనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. తినే తిండి, మంచి అలవాట్లు, మన పరిసరాలు, మనం ఆలోచించే విధానం ఆరోగ్యానికి చాలా ముఖ్యమని వివరించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మనం తినే ఆహారం మన ఆరోగ్యాన్ని కాపాడేలా ఉండాలని అన్నారు. గతంలో పంటలను రసాయన ఎరువులు, పురుగు మందులు వేయకుండా పండించామని ప్రస్తావించారు. జగన్ హయాంలో నాసిరకం మద్యం కారణంగా చాలామందికి ఆరోగ్య సమస్యలు వచ్చాయని అన్నారు. వైసీపీ హయాంలో దుర్మార్గమైన నిర్ణయంతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ధ్వజమెత్తారు. క్వాంటం, ఏఐ, డేటా సెంటర్, డిఫెన్స్ రీసెర్చ్ వంటి విభిన్న సాంకేతిక రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని వ్యాఖ్యానించారు. ఇంట్లోనే ఉంటూ ఫోన్లు వాడితే ఎలా...? కుటుంబ సభ్యులు నేరుగా మాట్లాడుకోవాలని సూచించారు. పది నిమిషాలు వ్యాయామం చేయటానికి ఓపిక లేకపోతే ఎలా..? అందుకే అనారోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈనెల 21వ తేదీన మరోసారి యోగా ద్వారా రికార్డులు సృష్టిద్దామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కృష్ణా నది బైపాస్ రహదారిపై యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా సంప్రదాయ వైద్య విధానాలు ప్రమోట్ చేస్తున్నారని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి గిన్నిస్ రికార్డులు వచ్చాయని ప్రస్తావించారు. మెడిటేషన్ యోగా కేంద్రాలు ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని సూచించారు. రైతన్నలు ప్రకృతి వ్యవసాయం చేయాలని సీఎం ఆకాంక్షించారు. ప్రస్తుతం 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని సీఎం చంద్రబాబు వివరించారు. రాబోయే రోజుల్లో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తామని అన్నారు. 'ఆస్పత్రులు ఆలయాలని.. వైద్యులు దేవుళ్లు. వైద్యో నారాయణో హరి అనేది మన సంస్కృతిలో ఉంది. ఏపీని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలని తన కోరిక. హెల్తీ, వెల్దీ, హ్యాపీ సమాజమే మా లక్ష్యం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా హైదరాబాద్

అత్యాధునిక రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని సీఎం తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని దక్షిణాఫ్రికా బృందాన్ని కోరారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఈ రంగంలో దక్షిణాఫ్రికా కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2026'లో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో పాటు అక్కడి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను సీఎం ఆహ్వానించారు. సీఎం ఆహ్వానంపై మషాటిలే స్పందిస్తూ.. పెద్ద సంఖ్యలో తమ ప్రతినిధులు పాల్గొంటారని, ఈ సదస్సు ద్వారా ఇరు దేశాల మధ్య వ్యాపార, పారిశ్రామిక సంబంధాలు మరింత బలపడతాయని అభిప్రాయపడ్డారు. అనంతరం జర్మనీలోని తురింగియా రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో వేగంగా విస్తరిస్తున్న శాస్త్ర సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, జీవ వైజ్ఞానిక రంగాల్లో పరస్పర సహకారాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో తురింగియా ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

మొదటిపేజీ తరువాయి

# చీలిక దిశగా తృణమూల్ కాంగ్రెస్

## మెజార్టీ ఎమ్మెల్యేల తిరుగుబావుటా

## 59మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంది

## బహిష్కృత ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ వెల్లడి

కోల్‌కతా,జూన్3హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి

అంతర్గత విభేదాలతో టీఎంసీ పార్టీ సతమతమవుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. తనకు 59 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని తృణమూల్ కాంగ్రెస్ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ పేర్కొన్నారు. అసెంబ్లీలో పార్టీకి మొత్తం 80 మంది శాసనసభ్యులు ఉండగా.. వారిలో మూడింట రెండొంతుల కంటే ఎక్కువమంది మద్దతు తమకు ఉందని పేర్కొంటూ స్పీకర్‌కు లేఖ సమర్పించారు. టీఎంసీ తిరుగుబాటు వర్గం ఆయనను కొత్త ప్రతిపక్ష నేతగా ప్రతిపాదిస్తు న్నట్లు తెలుస్తోంది. టీఎంసీ పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మందికి పైగా ఎమ్యెల్యేలు ప్రయత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా పేర్కొన్న అనంతరం ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ప్రస్తుతం రెబల్ వర్గానికి అంతకంటే ఎక్కువ (59) మద్దతు ఉండడంతో వారు టీఎంసీ పేరు, చిహ్నాన్ని సొంతం చేసుకునే అవకాశం ఉంది. తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా ఇటీవల శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకర్‌కు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను సోమవారం తృణమూల్ సస్పెండ్ చేసింది. నాటి నుంచి పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది.

మొదటిపేజీ తరువాయి

# రాజకీయాల్లో కులదూషణలు దారుణం

అమరావతిలో అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశించిన కుల నిర్మూలన పక్కనబెడితే.. 1989 నుంచి రాజకీయాల్లో కుల దూషణలు విపరీతంగా పెరిగిపోయాయని మండిపడ్డారు. కొంతమంది స్వార్థపరులు ఈ కుల సంఘాలను అడ్డం పెట్టుకుని వ్యక్తిగతంగా బాగుపడుతున్నారనే అనుమానం ఉందన్నారు. ఏ కులం నాయకుడితో ఆ కులం వారినే తిట్టించే నీచ సంస్కృతి వల్ల యువత భావోద్వేగాలకు లోనవుతున్నారని ఆందోళన చెందారు. గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మరీ దిగజారిందని, సమాజానికి అద్దం పట్టే జర్నలిస్టులను సైతం కులాల పేరుతో దూషించడం ప్రారంభించారని ధ్వజమెత్తారు. ఒక వ్యక్తి తప్పు చేస్తే, దానికి కులాలను ఆపాదిస్తూ సమాజంలో చిచ్చు పెడుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీ ఎమ్మెల్సీ దళిత యువకుడిని హత్య చేసి, శవాన్ని ప్యాక్ చేసి డోర్ డెలివరీ చేసినా ఆ పార్టీ వెనుకేసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా హింసించి చంపేసినా ఆయా కుల సంఘాలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయినా వైసీపీ తీరు మారలేదని, ఇలాంటి కుల రాజకీయాలకు చరమగీతం పాడాలని జనసేన గట్టిగా నిర్ణయించుకుందని స్పష్టం చేశారు. ఇటీవల కూటమి మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశంలో దీనిపై చర్చించామని.. ఎవరు ఎలా మాట్లాడినా తామంతా కలిసికట్టుగా స్పందిస్తామని పవన్ తెలిపారు. ఇకపై రాజకీయాల్లో జరిగే కుల దూషణలను, అరాచకాలను తిప్పికొట్టేందుకు జనసేన పక్షాన 'సేన గళం' పేరుతో ఒక హైపవర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు, ఇకపై ఎవరు దూషించినా 'సేన గళం' గట్టిగా స్పందిస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు.

మొదటిపేజీ తరువాయి

# తెలంగాణ అప్పులపై చర్చకు సిద్ధమే

నాకు అహంకారమని అంతా ఎందుకు అనుకుంటారని కచ్చితంగా ఆలోచిస్తుంటానని కేటీఆర్ తెలిపారు. అయితే కొంతమందికి కొన్ని కొన్ని మ్యాన్యుఫ్యాక్షరింగ్ డిఫెక్ట్ ఉంటాయని అన్నారు. అలాగే తనకు బాడీ లాంగ్వేజ్ సమస్య ఉందని తెలిపారు. అందుకే నవ్వుతూ మాట్లాడమని మిత్రులు చెబుతుంటారని.. కానీ అలా లేని నవ్వు తెచ్చుకుని నాకు మాట్లాడటం రాదని చెప్పారు. తెలంగాణ వాడిని కదా.. కడుపులో కత్తులు, పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక విప్లవాన్ని తీసుకొచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధిలో నంబర్‌వన్‌గా ఎదిగిందని పేర్కొన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలో జరగలేదని స్పష్టం చేశారు. అమలు కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. రెండేళ్లుగా ప్రభుత్వ ఆదాయం పతనమవుతోందని తెలిపారు. కరోనా కంటే డేంజర్ కాంగ్రెస్ పార్టీ అని ప్రజలకు అర్థమైందని అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూనే ప్రభుత్వ ప్రకటనల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తుందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన అప్పు రూ.2.8 లక్షలు మాత్రమేనని తెలిపారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని పేర్కొన్నారు. అప్పులు చేడయంలో రేవంత్ ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని విమర్శించారు. అప్పు చేసి తీసుకొచ్చిన ఈ డబ్బంతా ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు తీరుస్తున్నామని కాంగ్రెస్ చెబుతున్నది కాకిలెక్కలు అని కేటీఆర్ అన్నారు.

మొదటిపేజీ తరువాయి

# రష్యా నుంచి ఎస్-400 సుదర్శన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టం

త్వరలోనే ఆపరేషన్ ఏరియాలో దీనిని మోహరించనున్నట్టు వెల్లడించాయి. భారత్ 2018లో రూ.35,000 కోట్లతో 5 స్క్వాడ్రన్ల కొనుగోలుకు రష్యాతో ఒప్పందం చేసుకుంది. ఇందులో 3 స్క్వాడ్రన్లను రెండేళ్ల క్రితమే భారత్ అందుకుంది. నాల్గవది తాజాగా భారత్ చేరుకుంది. మరి కొద్ది నెలల్లోనే 5వ స్క్వాడ్రన్ కూడా భారత్‌కు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. పరేషన్ సిందూర్ సమయంలో పాక్ జరిపిన డ్రోన్, క్షిపణులను ఎస్–400 సుదర్శన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ అత్యంత సమర్థవంతంగా కూల్చివేసింది. ఏకకాలంలో 300 లక్ష్యాలను ట్రాక్ చేసి, 40 నుంచి 400 కిలోమీటర్ల దూరంలోని శత్రు క్షిపణులను, డ్రోన్లు, స్టెల్త్ ÷టైర్ జెట్‌లను ఈ ఎయిర్ డిఫెన్స్ సిస్టం సమర్థవంతంగా తిప్పికొట్టగలదు. కాగా, భారత్ సైతం రష్యా సిస్టమ్ తరహాలోనే శత్రువిమానాలను కుప్పకూల్చే డిఫెన్స్ సిస్టమ్ 'కుషా'ను స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తోంది. దీని అభివృద్ధి, ఉత్పత్తిలో భాగస్వామిగా ఇండియన్ డిఫెన్స్ మేజర్ సోలార్ ఇండస్ట్రీలు భాగస్వామిగా వ్యవహరిస్తున్నాయి. రష్యా నుంచి ప్రస్తుతం అందుకున్న ఎస్–400 సుదర్శన్ ఎయిర్ డిఫెన్స్‌ను పశ్చిమబెంగాల్‌లో మోహరించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

మొదటిపేజీ తరువాయి

# కర్నాటక సిఎం డికె కీలక నిర్ణయం

బెంగళూరు,జూన్3హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి

కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే డీకే శివకుమార్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పారు. విద్యార్థులందరికీ ఉచిత బస్‌పాస్‌లు ఇస్తామని ప్రకటించారు. ప్రభుత్వ పోస్టుల భర్తీకి ఏటా క్యాలెండర్ విడుదల చేస్తామని తెలిపారు. ఎన్‌రోల్ చేసుకునేందుకు ప్రైవేట్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వమే దీన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. రైతుల వలసలు అరికట్టేందుకు తగిన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థి సారథి స్కీమ్ కింద పాఠశాలలు, కాలేజీల నుంచి పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థుల వరకూ అందరికీ ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పిస్తున్నట్టు తొలి క్యాబినెట్ సమావేశానంతరం ప్రకటించారు. ఇందుకోసం ఎంత ఖర్చయినా సరే వెనుకాడమని చెప్పారు. రైతుల వలసలను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించామని చెప్పారు. యువతను ప్రభుత్వ ఉద్యోగాల్లో రిక్రూట్ చేసుకుంటామని, 56,000 పోస్టుల భర్తీకి సంబంధించి వివిధ డిపార్టమెంట్లతో చర్చించి జాబ్ క్యాలెండర్‌ను త్వరలోనే విడుదల చేస్తామని డీకే శివకుమార్ ప్రకటించారు. రాష్ట్రంలో ఎంఎ÷–లాయింమెంట్ ఎక్స్ఛేంజ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, ఉద్యోగాల కోసం అక్కడ పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 10,000 భారత్ జోడో యూత్ క్లబ్‌లు ఏర్పాటు చేస్తామని, క్రీడలు, యువనాయకత్వం, సామాజిక సామరస్యం పొంపొందించడం వీటి ముఖ్యోద్దేశమని, ఒక్కో అసోసియేషన్‌ను ప్రభుత్వం రూ.10 లక్షలు చొప్పున గ్రాంట్ మంజూరు చేస్తుందని ప్రకటించారు. ఇది తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని చెప్పారు

మొదటిపేజీ తరువాయి

# నెహ్రూ రికార్డుకు మోడీ బ్రేక్

అప్పటినుంచి ఇప్పటివరకు ఆయన ప్రధానిగా కొనసాగుతున్నారు. మోదీ ఇంతకుముందు కూడా ప్రధానిగా మరో రికార్డును బద్దలుకొట్టారు. వరుసగా, అత్యధిక కాలం ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ రికార్డును జూలై 5, 2025న దాటేశారు. ఇందిరాగాంధీ జనవరి 24, 1966న ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టి, వరుసగా 4,077 రోజులపాటు కొనసాగారు. ఆమె మార్చి 24, 1977లో వరకు ప్రధానిగా కొనసాగారు. అలా, ఇందిరా గాంధీ కంటే ఎక్కువ రోజులు వరుసగా ప్రధానిగా మోదీ కొనసాగుతున్నారు. స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి దేశ జనాభా దాదాపు 34 కోట్లు. కానీ, మోదీ 2014లో పదవి చేపట్టే సమయానికి దేశ జనాభా 131 కోట్లు. ప్రస్తుతం 146 కోట్లు అని అంచనా. ఇన్నేళ్లలో దేశంలో ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీల భాగస్వామ్యం కూడా పెరిగింది. దేశంలో తొలి ఎన్నికలు జరిగిన 1951?52లో 53 రాజకీయ పార్టీలు పోటీ చేశాయి. 2014 లోక్‌సభ ఎన్నికల సమయానికి దేశంలో 464 పార్టీలు పోటీచేయగా, 2024 ఎన్నికల సమయానికి 744 పార్టీలు పోటీ చేశాయి. దేశ తొలి ఎన్నికల సమయంలో 17 కోట్ల మంది ఓటు వేయగా, 2014 నాటికి దాదాపు 84 కోట్ల మంది ఓటు వేశారు. నెహ్రూ హయాంలో కాంగ్రెస్ ఆధిపత్యమే ఎక్కువగా ఉండేది. అప్పట్లో 489 లోక్‌సభ స్థానాలుంటే అందులో 364 సీట్లు కాంగ్రెస్ దక్కించుకుంది.

మొదటిపేజీ తరువాయి

# తెలంగాణలో భూముల విలువల్లో సవరణ

హైదరాబాద్,జూన్3హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి

తెలంగాణ ప్రభుత్వం భూములు, ప్లాట్లు, ప్లాట్ల మార్కెట్ విలువల సవరణకు ఆమోదం తెలిపింది. కొత్త మార్కెట్ విలువలు ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ల ధోరణి, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని 144 సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల మార్కెట్ విలువలు పెరిగాయి. ఔటర్ రింగ్ రోడ్ , రీజినల్ రింగ్ రోడ్ , అభివృద్ధి కారిడార్లు వంటి ప్రాజెక్టుల ప్రభావాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మార్కెట్ విలువలను సవరించింది. ప్లాట్ల మార్కెట్ విలువల్లో ఉన్న అసమానతలను తొలగించేందుకు హేతుబద్ధీకరణ చేపట్టింది. కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తుల ప్లాట్లకు ఒకే మార్కెట్ విలువను అమలు చేయాలని నిర్ణయించింది. అలాగే హెచ్‌ఎండిఎ, క్యూర్ ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లను నిర్ణయించింది. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ప్లాట్లకు కొత్త కనీస మార్కెట్ విలువలను ఖరారు చేయడంతో పాటు నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ రేట్లను కూడా సవరించింది. ఆర్‌సీసీ, నాన్–ఆర్‌సీసీ నిర్మాణాలకు సంబంధించిన విలువల్లో మార్పులు చేసింది. భూ లావాదేవీల్లో పారదర్శకతను పెంచడం, మార్కెట్ ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను నిర్ణయించడం ఈ సవరణల ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5 నుంచి అమల్లోకి వస్తాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూముల విలువల సవరణ శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ పరిస్థితుల మేరకు కొత్త విలువలు ఉన్నాయన్నారు. నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రాంతాలవారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు పరిశీలించామన్నారు. భూలావాదేవీల్లో సమస్య పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా పునఃపరిశీలన చేశాం. 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువలపై సమీక్ష జరిపాం. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు అధ్యయనం చేశాయి. అభివృద్ధి, భూముల డిమాండ్, మార్కెట్ పరిస్థితులు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, కొత్త రోడ్లు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణను ప్రమాణాలుగా తీసుకున్నాం. ఎ÷–లాట్ల విషయంలో అసమానతలు తొలగిస్తూ కొన్ని చోట్ల అన్ని అంతస్తులకు ఒకే ధర ఉంటుంది. ఇప్పటికే అధిక ధర ఉన్నచోట పెంపు ప్రతిపాదనలు లేవు. హెచ్‌ఎండీఏ, క్యూర్, ఇతర ప్రాంతాలకు ప్రాథమిక మార్కెట్ రేట్లు నిర్ణయించాం. 2021 తర్వాత నిర్మాణ వ్యయాలు సవరించడంతో కొత్త ధరల అవసరం ఏర్పడింది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకతతో సవరణలు చేపట్టాంఅని మంత్రి తెలిపారు.

# విద్యాహక్కు చట్టం అమలు సాధనకై బహుజన ప్రజా శక్తి కన్వీనర్ నల్ల లక్ష్మణ్ అధ్వర్యంలో జరుగుతున్న పాదయాత్రకు సంపూర్ణ మద్దతు - బహుజన ప్రజా సంఘాల సమితి

- ఈనెల 10న ఇందిరాపార్క్ వద్ద సభకు రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు తరలిరావాలని పిలుపు - విద్యా హక్కు చట్టం ప్రతిఒక్కరి హక్కు

**హైదర్ గూడ, జూన్ 03(హైదరాబాద్ మిర్రర్):**

హైదరాబాద్ హైదర్ గూడ లోని ఎన్ఎస్ఎస్ ప్రెస్ క్లబ్ లో బుధవారం బహుజన ప్రజా సంఘాలు జిల్లా వెంకటేష్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. విలేకరుల సమావేశంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక మాట్లాడుతూ ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి 79 సంవత్సరాల స్వతంత్ర భారత దేశంలో అక్షరాస్యత 70% , మహిళల అక్షరాస్యత 55% దాటితే ఉద్యోగ ఉపాది కల్పనాలో మన రాష్ట్రం చాలా వెనుక బాటులో ఉంది సామాజిక అవమానాలు, ఆర్థిక అసమానతలలో మన రాష్ట్రం చాలా ముందు ఉంది, విద్య లేక రాష్ట్రంలో దేశంలో పురోగతి లేక జపాన్, ఇజ్రాయెల్ లాంటి దేశాలతో శాస్త్ర సాంకేతిక డిఫెన్స్ రంగాలలో పోటి పడలేక పోతున్నాం. చిన్న చిన్న దేశాలు ఎగుమతుల్లో టాప్ ఉంటే అత్యధిక మ్యాన్ పవర్ ఉన్న మన దేశం దిగుమతుల్లో టాప్ 70% దిగుమతులె దీనికి కారణం విద్యకు అధిక జనాభాను దూరం చేయడమే, ప్రైవేటు విద్యను పోత్సయిస్తు ప్రభుత్వ విధ్యను నిర్లక్ష్యం చేస్తున్నారు. కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ విద్య లేదు. అధిక ఫీజులు చెల్లించలేని చాలా మంది పేద వర్గాలు విధ్యాకు దురమైతు ప్రభుత్వం ఉపాది ఉద్యోగ అవకాశాలు చూపని ప్రభుత్వ విద్యవల్ల నిత్యం యువత దినసరి కూలీలుగా క్రిమినల్స్ గా మారుతు జీవితాలు అర్ధాంతరంగా ముగించుకుంటున్నారు .కుల మత కూబిలో నెట్టపడుతు సంకుచిత మనస్థత్వంతో ఐక్యం కాలేక అన్నిరంగాల్లో వెనక బాటుకు గురైతున్నారు. మాదిగల రిజర్వేషన్ పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లా వెంకటేష్ మాట్లాడుతూ బడుల కంటే ఎక్కువ గుడులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకే వీటన్నిటికి మూలం విద్య కాబట్టి తక్షణమే విద్యాహక్కూ చట్టం అమలు చేయండి. బడ్జెట్లో 25% నిధులు కెటాయించండి. 25 శాతం ప్రైవేట్ విద్యావ్యవస్థలో ఫ్రీ అడ్మీషన్లు ఇప్పించండి, అధిక ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి.ఉద్యోగ ఉపాది కల్పించే అన్ని పోటి పరిక్షల కోర్సులకు ఉచిత కోచింగ్ ఇవ్వాలి. ఎస్ఎస్సి, ఇంటర్, డిగ్రీ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కాలేజీల సంఖ్యను పెంచాలి. ప్రతి ముండల కేంద్రంలో గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో నాగర్ కర్నూల్ జిల్లా వంగూరి




మండలం కొండారెడ్డి పల్లి నుంచి విద్యా హక్కు చట్ట సాధనకై హైదరాబాదు ఇందిరా పార్కు వరకు బహుజన ప్రజా శక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్ అధ్వర్యంలో జరుగుతున్నా పాదయాత్రకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాం .పై డిమాండ్లు నెరవేరకుంటే ఈ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చారిస్తున్నాం. విలేకరుల సమావేశానికి లాయర్ మల్లన్న,తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల నర్సింగరావు, ఉపాధ్యక్షులు సాంబరాజు కుమార్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శాగంటి వెంకటేష్, జిల్లా యూత్ అధ్యక్షులు పొలాస సాయికుమార్, జిల్లా నాయకులు కొత్త సంపత్,కోలిపాక ప్రశాంత్,కాప్ర మండల అధ్యక్షులు పొలాస కిరణ్ కుమార్, అంబేద్కర్ నగర్ రాజ్ కుమార్ గౌడ్, శివరాత్రి భాస్కర్ వడ్డెర,పెంట సంతోష్ పద్మశాలి తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు

సింధూ-ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో రామచంద్రపురంలో కార్యక్రమాలు

భారీగా పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాలు

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 03:**

తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, శాసనసభలో బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు ని ఆయన జన్మదినం సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సింధూ-ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో రామచంద్రపురంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి నియోజకవర్గానికి చెందిన పలువురు పార్టీ నాయకులతో కలిసి రామచంద్రపురంలోని తన నివాసంలో కేకు కట్ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింధూ-ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో హరీష్ రావు విశిష్ట పాత్ర పోషించారని అన్నారు. ముఖ్యంగా నీటిపారుదల, రైతు సంక్షేమం, వైద్య ఆరోగ్య రంగాల్లో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజా నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేస్తూ బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న హరీష్ రావు కి ప్రజల్లో విశేష ఆదరణ ఉందని తెలిపారు. హరీష్ రావు నేడు తిరుపతి పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ముందస్తుగా మంగళవారం ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్, పరమేష్ యాదవ్, రమేష్ మరియు భారీఎత్తున మహిళా నాయకురాల్లు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఏరియా ఆసుపత్రికి ప్రథమ బహుమతి






**రామకృష్ణాపూర్,జూన్ 3 (హైదరాబాద్ మిర్రర్ )**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మందమర్రి గ్రౌండ్‌లో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రి సిబ్బంది విశిష్ట ప్రతిభ కనబరిచారు.ఏరియా ఆసుపత్రి సిబ్బంది వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య అవగాహన స్టాల్‌కు ప్రథమ బహుమతి లభించింది.అదేవిధంగా సమాజంలో ఆరోగ్యం చైతన్యం,సామాజిక బాధ్యతలను పెంపొందించే లక్ష్యంతో ఆసుపత్రి సిబ్బంది ప్రదర్శించిన అవగాహన నాటిక (స్కిట్) ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని ప్రశంసలు అందుకుంది.ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ (అడ్మినిస్ట్రేషన్) డాక్టర్ మధు కుమార్ మాట్లాడుతూ,ఈ విజయం ఆసుపత్రి సిబ్బంది సమిష్టి కృషి,సేవా తత్పరత, అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఈసందర్భంగా ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది,పారామెడికల్ సిబ్బంది,ఇతర ఉద్యోగులను ఆయన అభినందించారు. భవిష్యత్తులో కూడా ప్రజారోగ్య పరిరక్షణతో పాటు సామాజిక అవగాహన కార్యక్రమాల్లో ఇదే ఉత్సాహంతో పాల్గొని సంస్థకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.కాగా,ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం చీఫ్ మెడికల్ ఆఫీసర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న మ్యాట్రన్ విజయలక్ష్మి,సీహెచ్ సుశీల ను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.ఆసుపత్రి సిబ్బంది సాధించిన ఈ విజయాలు ప్రజారోగ్య సేవల్లో వారి నిబద్ధతకు నిదర్శనంగా నిలిచాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# ముక్కగల్ల యాదన్న - సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్‌గా పీ. తాన్య బాధ్యతల స్వీకరణ

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 03:**



సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని గడ్డపోతారం పురపాలక సంఘ కార్యాలయంలో నూతన మున్సిపల్ కమిషనర్‌గా శ్రీమతి పీ. తాన్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కమిషనర్ పీ. తాన్య మాట్లాడుతూ... పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవల అందజేతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట: ఎమ్మెల్యే జీఎంఆర్

మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్, రైస్ మిల్ ఏర్పాటుకు భూ కేటాయింపులు

సమాఖ్య భవనాలకు నిధులు అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు

డ్రగ్స్ నియంత్రణ, చెరువుల అభివృద్ధి, స్లాటర్ హౌస్ ఏర్పాటుపై సమీక్ష

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ జూన్ 03:**



సమాజంలో మహిళల ఆర్థిక స్వావలంబన, కుటుంబ సంక్షేమం, సామాజిక అభివృద్ధిలో స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మహిళా సంఘానికి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రుణాలు అందించడంతో పాటు వారి అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు.మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిఆర్డిఏ, మెప్మా, యూడీసీ, రెవెన్యూ, ఎక్సైజ్, హెచ్ఎండిఏ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి కోసం కొల్లూరులో పెట్రోల్ బంక్, గుమ్మడిదల మండలం కొత్తపల్లిలో రైస్ మిల్ ఏర్పాటుకు పరిపాలనా అనుమతులు లభించాయని, త్వరలోనే భూమి కేటాయింపులు చేపడతామని వెల్లడించారు. మహిళా సంఘాల అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో అమలు చేయాలని సూచించారు. గుమ్మడిదలలో మండల స్థాయి మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి సిఎస్ఆర్ నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు.



# సాంస్కృతిక సారధి కళాకారుల బృందాన్ని సన్మానించిన

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాచకొండ రమేష్ బాబు

**సంస్థాన్ నారాయణపురం, జూన్ 03(హైదరాబాద్ మిర్రర్):**

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సాంస్కృతిక సారధి కళాకారుల బృందం బేటి పడావో బేటి బచావో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సాంస్కృతిక సారధి కళాకారుల బృందం బోయపల్లి రంగన్న, పాశం రాము, యాట సంధ్య, బోనాల నరేందర్, గుండెల లింగస్వామి, లావణ్య, సిద్దు కళాకారులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాచకొండ రమేష్ బాబు సన్మానించారు. ఈ సందర్భంగా రాచకొండ రమేష్ బాబు మాట్లాడుతూ కలకల కోసం కాదు, కల ప్రజల కోసం కళాకారులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళాకారులను ప్రోత్సహిస్తూ ప్రజలకు వారి యొక్క కల నైపుణ్యాన్ని ప్రదర్శిస్తు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలువేరు అంజయ్య, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, యూత్ కాంగ్రెస్ మండల కార్యదర్శి కొండ నవీన్ గౌడ్, బానోతు కిరణ్ నాయక్, వడ్డేపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.





# ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య

**మంగపేట,జూన్ 03,హైదరాబాద్ మిర్రర్**

ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య అన్నారు.బుధవారం మండలంలోని కమలాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా కూలి పనులకు వచ్చిన గ్రామ ప్రజలతో మాట్లాడి పలు సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.వేసవికాలం దృష్టిలో పెట్టుకొని అందరూ కూడా పలు జాగ్రత్తలు తీసుకొని చల్లగా ఉన్న సమయంలో ఉపాధి హామీ పథకం వినియోగించుకోవాలని సూచించి మజ్జిగ ప్యాకెట్లు పంపిణి చేశారు.ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పనిని వినియోగించుకోవడం వలన 40 శాతం ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా సిసి రోడ్ల మంజూరు కూడా జరుగుతుందని తెలియజేశారు.ప్రజా ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతున్న కొందరికి సంక్షేమ పథకాలు అందడం లేదని విషయం దృష్టికి వచ్చిందని పథకాలు అందని వారు అర్హత కలిగి లబ్ధి పొందని వారు ఆయా శాఖల కార్యాలయంలో మరొకసారి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందించే విధంగా అధికారులకు సూచిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పెద్ది నరసింహారావు, ఆత్మ డైరెక్టర్ ఇనుగాల కవిత,మండల మహిళా ప్రధాన కార్యదర్శి చింత చంద్రావతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిమ్మల రాంబాబు,తోట అశోక్, కోల శివ, అబ్బాస్ రాజు, ఎండి మహిమూద్, సదానందం, గ్రామ మహిళా ప్రధాన కార్యదర్శి వడ్లకొండ భాను, మహిళా నాయకురాలు, గోమాస పద్మ, గ్రామపంచాయతీ కార్యదర్శి సిహెచ్ రంజిత్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నర్సబాయి కుంట ను సందర్శించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి లు

**గండిపేట్ : హైదరాబాద్ మిర్రర్**

మార్కండేయ నగర్, బాబులల్ రెడ్డి నగర్,ను ఆనుకొని ఉన్న నర్సబాయి కుంటను అభివృద్ధి చేయడానికి అంచనాలు తయారు చేయాలని ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అధికారులకు సూచించారు. బుధవారం రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన నర్సభాయి కుంట ను పరిశీలించారు . అటు సాయిబాబా నగర్ ఇటు మార్కండేయ నగర్, బాబుల్ రెడ్డి నగర్, వెంకటేశ్వర కాలనీ ల మధ్య ఉన్నటువంటి నర్సాబాయి కుంటను సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. అభివృద్ధితో పాటు వాకింగ్ ట్రాక్ చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాట్లు, ఓపెన్ జిమ్ లాంటి సౌకర్యాలను కల్పిస్తే బాగుంటుందన్నారు. జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాజేంద్రనగర్ జోన్ పరిధిలో ఉన్న పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే నర్సబాయి కుంట ను పరిశీలించడం జరిగిందని తెలిపారు. త్వరలోనే అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారుల సహకారంతో నిధుల మంజూరు కి ఆమోదం పొంది నర్సబాయి కుంట ను ప్రజలకు అనుకూలంగా అభివృద్ధి చేస్తామని సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు ధనుంజయ్ సరికొండ వెంకటేష్, సోమ శ్రీనివాస్ గుప్తా, ప్రేమ్ గౌడ్, కళ్లెం లక్ష్మారెడ్డి, మదన్ గౌడ్, కోట పవన్ కుమార్ నేత, బోనకుర్తి రాము నేత, శ్రీనివాస్ రెడ్డి, ఓం ప్రకాష్, కృష్ణ, కిషోర్, మామిడి శెట్టి శ్రీనివాస్ నేత, సోమ సందీప్ గుప్తా, జగన్, మలేష్, హనుమంతు, రాయుడు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.....



# ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కారించండి

**మంచిర్యాల,జూన్ 03 హైదరాబాద్ మిర్రర్**



ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) అనుబంధ హెచ్ఎంఎస్ ఆటో డ్రైవర్స్ యూనియన్,మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు వార్షికంగా రూ. 12,000 ఆర్థిక సహాయం,ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు,ఇంటి స్థలాల కేటాయింపు,ఆటో నగర్‌ల నిర్మాణం తదితర హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు వాటి అమలులో ఎలాంటి పురోగతి కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఉచిత బస్సు పథకం కారణంగా ఆటోలకు గిరాకీ గణనీయంగా తగ్గిపోయి ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడిందని పేర్కొన్నారు. మరోవైపు పెరుగుతున్న ఇంధన ధరలు,వాహనాల నిర్వహణ ఖర్చులు,బ్యాంకు రుణాల భారం కారణంగా ఆటో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి ఆటో డ్రైవర్‌కు వార్షికంగా రూ. 12,000 ఆర్థిక సహాయం అందించడం, ప్రత్యేక ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు,ఇంటి స్థలాల కేటాయింపు,ఆటో నగర్‌ల నిర్మాణం,గుర్తింపు కార్డుల జారీ, ప్రమాద,ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించడం,ఆటో కార్మికుల పిల్లలకు విద్యా సహాయం అందించడం,ఆటో స్టాండ్ల వద్ద మౌలిక వసతులు ఏర్పాటు చేయడం,వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయడం, తక్కువ వడ్డీ రుణాలు అందించడం వంటి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు సమర్పించినట్లు తెలిపారు.జిల్లాలో వేలాది మంది ఆటో డ్రైవర్లు,వారి కుటుంబాలు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నందున ప్రభుత్వం వారి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి షఫీ, జిల్లా ప్రధాన కార్యదర్శి తగురం శ్రీనివాస్,హెచ్ఎంఎస్ జిల్లా నాయకులు కర్ణకంటి రవీందర్, సీనియర్ ఆటో యూనియన్ నాయకులు కలవాల అంజన్న, ఆటో డ్రైవర్లు పల్లపు శ్రీనివాస్, చల్లా సురేష్, అనంతుల మహేష్,రాజుగారి మహేష్, తాజ్‌బాబా,సంతు,స్టాలిన్, మహేందర్, సాయి,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా కలెక్టర్‌కు హెచ్ఎంఎస్ వినతిపత్రం**

**ఎన్నికల హామీలను వెంటనే అమలుచేయాలి**

**హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్**

## చౌటుప్పల్ లో ఘనంగా టి.హరీష్ రావు జన్మదిన వేడుకలు

**చౌటుప్పల్,జూన్ 03, హైదరాబాద్ మిర్రర్ :**

బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను బుధవారం చౌటుప్పల్ పట్టణంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ ఆఫీసులో మున్సిపాలిటీ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయన జీవితంలో ఇంకా ప్రజాసేవలో ఉన్నత పదవులు చేపట్టి తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకురావాలని భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు, నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మల్లేష్ గౌడ్,బార్ కౌన్సిల్ అధ్యక్షులు తాడూరు పరమేష్, సతీష్, తూర్పునూర్ మల్లేష్ గౌడ్, కానుగు శివ, బండ్ల శ్రీకాంత్,అమీర్, మున్నా,సంగిశెట్టి శివ,అతు ఈశ్వర్,విజయ్, గంగాదేవి రమేష్, గంగాదేవి శివ, చీమకండ్ల కృష్ణయ్య, నరేంద్ర,సాగర్, రమణ గోవి రఘు, పిల్లలమర్రి సాయి, గుండెబోయిన వెంకటేశం, కోయిలగూడెం వెంకటేశం, మునిర్, ఒమేర్,కళ్లెట్లనాగరాజు, రెడ్డగోని మల్లేశం,ఊదరి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రత్యేక వార్డు సభలు నిర్వహణకు క్యాతనపల్లి పురపాలక సంఘం ఏర్పాట్లు

**రామకృష్ణాపూర్ జూన్ 03 హైదరాబాద్ మిర్రర్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం చివరి పది రోజులను విస్తృత స్థాయిలో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించిన నేపథ్యంలో క్యాతనపల్లి పురపాలక సంఘం ప్రత్యేక వార్డు సభల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసింది.ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం,ప్రభుత్వ సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలు,సాధించిన విజయాలను ప్రజలకు చేరవేయడం లక్ష్యంగా జూన్ 4, 6,8,10 తేదీలలో ఉదయం 9 గంటల నుంచి ప్రత్యేక వార్డు సభలు నిర్వహించనున్నట్లు పురపాలక కమిషనర్ తెలిపారు.జూన్ 4న వార్డులు 1, 2, 3, 5, 9, 15 పరిధిలోని ప్రాంతాల్లో సభలు జరగనున్నాయి.రవి కంగన్ హాల్ సమీపం,ఎస్సీసీఎల్ డిస్పెన్సరీ, ఇందిరానగర్ పీర్ల మసీదు, అమరావతి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల,పల్లవి స్కూల్ సమీపంలోని అమ్మ గార్డెన్ రోడ్, మల్లికార్జున్ నగర్ రాజు టైలర్ షాప్ ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.జూన్ 6న వార్డులు 4,6,10,11, 13,22 పరిధిలో శ్రీ సాయి గణేష్ మండలి యంగ్ స్టార్ యూత్ గ్రౌండ్,శేషపల్లి ప్రభుత్వ పాఠశాల,కుర్మపల్లి విలేజ్ మెయిన్ సెంటర్,శివాజీనగర్ గణేష్ మండపం,ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల,స్నేహ గణేష్ మండపం ప్రాంతాల్లో సభలు జరగనున్నాయి.జూన్ 8న వార్డులు 7,12,14, 17,19 పరిధిలో గద్దెరగడి హనుమాన్ ఆలయం, మహంకాళి ఆలయం,పోచమ్మ ఆలయం,గణేష్ మండపం, అబ్రహాం నగర్ గణేష్ మండపం వద్ద సమావేశాలు నిర్వహించనున్నారు.అలాగే జూన్ 10న వార్డులు 8, 16,18,20,21 పరిధిలో గద్దెరగడి హనుమాన్ ఆలయం,ఠాగూర్ స్టేడియం,రామ్‌నగర్‌లో బత్తుల శ్రీనివాస్ నివాసం సమీపం, ఎస్ఆర్‌కే స్కూల్,గణేష్ ఆలయం వద్ద ప్రత్యేక వార్డు సభలు జరగనున్నాయి. ఈ సమావేశాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు తమ సమస్యలు,సూచనలు తెలియజేయాలని పురపాలక అధికారులు కోరారు.

# డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

**బాలాపూర్ (హైదరాబాద్ మిర్రర్)**

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ సర్కిల్-16 నాదర్గుల్ డివిజన్-57 అల్మాస్‌గూడ వినాయక హిల్స్ కాలనీలో దీర్ఘకాలంగా ఉన్న డ్రైనేజీ సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభించనుంది. కాలనీలో స్థానిక డ్రైనేజీ సమస్యలను డిఈ అభినవ్ స్వయంగా పరిశీలించారు. సమస్య తీవ్రతను గుర్తించి వేను వెంటనే డ్రైనేజీ మరమ్మతు పనులు ప్రారంభిస్తామని కాలనీవాసులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఏఐసిసి విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, ఎదుళ్ల ప్రతాప్ రెడ్డి, అనిల్, పాల్గొన్నారు. కాలనీ సమస్యలపై సానుకూలంగా స్పందించి, వెంటనే పనులు పనులు ప్రారంభిస్తామని బరోసా ఇచ్చిన అధికారులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



# ఫసల్‌వాది గ్రామ పంచాయతీకి జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు

**"ఉమెన్ ఫ్రెండ్లీ థీమ్" విభాగంలో గుర్తింపు**

**న్యూఢిల్లీలో జాతీయ అవార్డు ప్రదానం**

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, సర్పంచ్ హరి ప్రసాద్ అవార్డు స్వీకరణ**

**మహిళా సాధికారత, సంక్షేమ కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో ప్రశంసలు**

**గ్రామాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యానికి గుర్తింపుగా పురస్కారం**

**సంగారెడ్డి, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 03:**

సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండలంలోని ఫసల్‌వాది గ్రామ పంచాయతీ మహిళా సాధికారత, మహిళలకు అనుకూలమైన సేవలు, సంక్షేమ కార్యక్రమాల అమలులో విశేష ప్రతిభ కనబరిచి "ఉమెన్ ఫ్రెండ్లీ థీమ్" విభాగంలో జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది.ఈ సందర్భంగా బుధవారం న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర పంచాయతీరాజ్, మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, కేంద్ర సహాయ మంత్రి ఎస్.పీ. సింగ్ బఘేల్ చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేశారు.సంగారెడ్డి జిల్లా తరపున జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఫసల్‌వాది గ్రామ సర్పంచ్ హరి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గోవింద్ శెట్టి ఈ జాతీయ అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జానకి రెడ్డి, డీపీఓ మల్లారెడ్డి, డీఎల్పీఓ అనిత, ఎంపీఓ శ్రీకాంత్ పాల్గొన్నారు. మహిళల సంక్షేమం, భద్రత, సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ గ్రామంలో చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, మహిళలకు అనుకూలమైన సేవలు, గ్రామాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించే చర్యల ఫలితంగానే ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించినట్లు అధికారులు తెలిపారు.




# రోడ్డు విస్తరణ బాధితులకు అండగా ఉంటాం

## - ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 04:**

అమీన్‌పూర్‌లో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కూల్చివేత మార్కింగ్ చేసిన ఇళ్లను మినహాయించి, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని అమీన్‌పూర్ పీపుల్స్ అసోసియేషన్ ప్రతినిధులు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కోరారు. బుధవారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, పేద మరియు మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. రోడ్డు విస్తరణ వల్ల ఇళ్లు దెబ్బతినకుండా ఉండేందుకు, ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఫ్లైఓవర్ నిర్మాణ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని తెలిపారు. ఈ అంశంపై వారం రోజుల్లోనే నీటిపారుదల శాఖ, మున్సిపల్ శాఖ అధికారులతో ఉన్నత స్థాయి సంయుక్త సమావేశం నిర్వహించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే వెల్లడించారు. బాధిత ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజా సంక్షేమమే తన లక్ష్యమని, పేద ప్రజలకు గరిష్ట న్యాయం జరిగేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే సానుకూల స్పందనపై అమీన్‌పూర్ పీపుల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి, రఘువంశీ, నాగిరెడ్డి, వెంకటేశ్వరరావు, రాము, భరద్వాజ్, మదన్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులకు శిక్ష పడుతుందనీ నమ్ముతున్నాం

**సిట్ విచారణ అనంతరం బడంగ్ పేట్ మాజీ మేయర్ పారిజాత**

**బాలాపూర్ (హైదరాబాద్ మిర్రర్)**



ఫోన్ ట్యాపింగ్ కు సంబంధించి సిట్ విచారణలో 30 నిమిషాల పాటు నా స్టేట్మెంట్, నా భర్త స్టేట్మెంట్ ను సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) అధికారులు రికార్డ్ చేశారని తెలిపిన బడంగ్పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి. 2022 ఏడాది ఎన్నికల సమయంలో మా ఇద్దరి ఫోన్లు ట్యాపింగ్ కి గురైనట్టు అధికారులు చెప్పారు. అధికారులు చెప్పేవరకు మా ఫోన్లు ట్యాపింగ్ కు గురైందని విషయం మాకు తెలియలేదని, భార్యాభర్తలిద్దరి ఫోన్లు ట్యాప్ చేయడం దురదృష్టకరం, నిరంతరం ప్రజా సేవలో మమేకమై ఉండడంతో మా ఫోన్లు ట్యాపింగ్ జరిగినట్లు గుర్తించలేకపోయామని, గత ప్రభుత్వంలో మహిళా నేత, మాజీ మంత్రి మాపై ఇంత కక్ష్యతో వారికి నియోజకవర్గంలో మేము పోటీగా ఉంటామని, దగ్గరుండి ఫోన్ ట్యాపింగ్ చేశారనే అనుమానం ఉందని, ఎన్నికల సమయంలో మా కదలికలపై నిరంతరం నిఘా పెట్టారు, కానీ అది ట్యాపింగ్ చేసి అనే విషయం ఇప్పుడు గుర్తించామని, మేము చేసే కార్యక్రమాలకు అడుగడుగున అడ్డు పడేవారని, మా వ్యూహాలను ముందే పసిగట్టి ఎవరెవరు మాతో కలసి పని చేయాలనుకుంటున్నారు వారికి బెదిరింపులు గురి చేసేవారని, మహేశ్వరం నియోజకవర్గంలో మమ్ముల్ని ఎదగకుండా అడ్డుకోవడానికి ఈ విధమైన చర్యలు చేపడతారని గుర్తించలేకపోయమని, ప్రజాక్షేత్రంలో దొంగ దారిన కాకుండా ప్రజాసేవలలో పోటీ పడి తేల్చుకోవాలి కానీ ఈ విధంగా కాదని, సిట్ పై పూర్తి నమ్మకం ఉందని, రేవంతన్న ప్రభుత్వం తప్పకుండా మాకు న్యాయం చేస్తారని నమ్మకం ఉంది, ఫోన్ ట్యాపింగ్ కేసులో అసలైన నిందితులకు త్వరలోనే శిక్ష పడుతుందనీ నమ్ముతున్నామని తెలిపారు.

# 18 ఏళ్ళుగా ఇంటి స్థలం కోసం గ్రేటర్ జర్నలిస్టుల ఎదురుచూపు

**అక్రెడిటేషన్ తో సంబంధం లేకుండా ఇళ్లస్థలాలు ఇవ్వండి**

**మద్దతు ప్రకటించిన కోదండరాం**

**ముఖ్యమంత్రికి జీహెచ్ జే సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి**

హైదరాబాద్(హైదరాబాద్ మిర్రర్)

సుప్రీం కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్ట్స్ యాక్ట్ ప్రకారం అన్ని కేటగిరీల్లోని జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జర్నలిస్టులందరికి వెంటనే ఇళ్ళస్థలాలు కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా.. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం విచారకరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అన్నారు. బుధవారం హైదరాబాద్ చిక్కడపల్లి లోని శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలు, సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీకి స్థలం లేదా సభ్యులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతూ తీర్మానించింది. అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇవ్వాలని, జర్నలిస్టుల్లో వివక్ష చూపొద్దని సమావేశం కోరింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న అన్ని కేటగిరీల జర్నలిస్టులకు 200 చ. గ స్థలాన్ని ఫ్యూచర్ సిటీలో కేటాయించాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ సొసైటీలో సభ్యత్వం తీసుకున్న 1350 మంది గ్రేటర్ జర్నలిస్టులు 18 ఏళ్ళుగా ఇంటి స్థలం కోసం ఎదురు చూస్తున్నారని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని, కనీసం ఈ ప్రభుత్వం అయినా ఇళ్ళ స్థలాలిచ్చి ఆదుకోవాలని కోరారు. గ్రేటర్ సొసైటీలో ఉన్న దాదాపు 1350 మంది జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం చాలా ఏళ్ళుగా ఎదురుచూస్తున్నారని, ఇప్పటికే ఎంతోమంది జర్నలిస్టులు స్థలం పొందకుండానే చనిపోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పలువురు మంత్రులను కలిసి పలుమార్లు విన్నవించినప్పటికీ స్థలం



కేటాయింపునకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా ప్రభుత్వం చేతులెత్తేసిందని, మొన్న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళస్థలాలపై ఎటువంటి నిర్ణయం లేదని, నిన్న జరుపుకున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగంలో జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ళస్థలాల మాటే లేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును పక్కన పెట్టి ప్రత్యామ్నాయ జీవోల ద్వారా జర్నలిస్టు సొసైటీలకు స్థలాలు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు. సొసైటీ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాల్సి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అనివార్యకారణాల వల్ల హాజరుకాలేకపోయారు. దీంతో ఆయన ఫోన్ ద్వారా తన సందేశాన్ని సమావేశానికి వినిపించారు. గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి తన మద్దతు ఉంటుందని, ముఖ్యమంత్రితో మాట్లాడి జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చేవిధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా సమావేశానికి రావాల్సిన రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ కూడా అత్యవసర పని వల్ల రాలేకపోయారు. ఆయన కూడా సొసైటీ సమావేశానికి మద్దతు తెలియజేశారు. అంతకు ముందు సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నైశిదం సత్యనారాయణ మూర్తి, తెలంగాణ జనసమితి గ్రేటర్ బీసీ సెల్ అధ్యక్షుడు జశ్వంత్, సీనియర్ జర్నలిస్టులు తీగవరపు శాంతి, నాగవాణి, సొసైటీ కోశాధికారి తన్నీరు శ్రీనివాస్, డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

**సైబరాబాద్ సీపీని కోరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ జూన్ 03:

కొల్లూరు, ఉస్మాన్‌నగర్, నాగులపల్లి ప్రాంతాల్లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డిను కోరారు. బుధవారం గచ్చిబౌలిలోని సీపీ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి ఎమ్మెల్యే వివిధ అంశాలపై చర్చించారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలవుతూ ఆరోగ్య, ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబాలు అధికంగా నివసిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో డ్రగ్స్ ప్రభావం వల్ల కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీపీ రమేష్ రెడ్డి, త్వరలో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడతామని, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తామని తెలిపారు.



# జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి మరో మైలురాయి

మొదటిపేజీ తరువాయి







హత్నూర, హైదరాబాద్ మిర్రర్ జూన్ 03:

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోరపట్ల శివారులో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన తెరానిమ్ బయోలాజిక్స్ తయారీ యూనిట్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం, పారదర్శక విధానాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో ఉండటంతో ప్రపంచ స్థాయి సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని పేర్కొన్నారు. బయోటెక్నాలజీ, ఔషధ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే దేశంలో అగ్రగామిగా నిలిచిందని, తెరానిమ్ బయోలాజిక్స్ వంటి ఆధునిక సాంకేతికత కలిగిన సంస్థల రాకతో రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని అన్నారు. అలాగే ఈ సంస్థ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా దోహదం చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ అత్యాధునిక బయోలాజికల్ ఔషధాల తయారీలో ఈ యూనిట్ కీలక పాత్ర పోషించనుందని తెలిపారు. వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు, పరిశోధనలకు ఇలాంటి సంస్థలు బలాన్ని చేకూరుస్తాయని అన్నారు. సంగారెడ్డి జిల్లా ఔషధ, బయోటెక్నాలజీ రంగాలకు ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని, పరిశ్రమల విస్తరణతో పాటు స్థానిక ప్రజల జీవనోపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని పేర్కొన్నారు. పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించాలని సంస్థలకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ కలెక్టర్ పాండు, సంస్థ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మూసాపేట్ లో ఘనంగా మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు

**కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ కార్పొరేటర్, బిఆర్ఎస్ నాయకులు**

కూకట్ పల్లి, జూన్ 03 (హైదరాబాద్ మిర్రర్) :

సిద్దిపేట శాసనసభ్యులు, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలు మూసాపేట్ జనతా నగర్ లో ఘనంగా జరిగాయి. హరీష్ రావు వీరాభిమాని, శ్రీకాకుళం జిల్లాకు చెందిన కిలారు శేషు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలకు మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై బిఆర్ఎస్ శ్రేణుల మధ్య కేక్ కట్ చేసి, సంబురాలు చేసుకున్నారు. అనంతరం శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా నాయకుడు, పేదల సంక్షేమం కోసం పరితపించే హరీష్ రావు మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రాంతీయ భేదం లేకుండా కేవలం అభిమానంతో కిలారు శేషు ఆధ్వర్యంలో హరీష్ రావు జన్మదిన వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జిల్లా గోపాల్, గరిగె తుకారాం, ఇనుగంటి రాజు, చెరుకు సత్యనారాయణ, తూము మనోజ్, కృష్ణ, అర్జున్, సత్యనారాయణ, నరేశ్, అక్షయ్, గిరీష్, సిద్దార్థ్, శ్యామల, సూర్యకళ, సుకన్య, రమాదేవి, పద్మ,శోభ, లావణ్య, సుజాత , అనురాధ, సంధ్య, ఉమ , శిరీష తదితరులు పాల్గొన్నారు.



# ఆదాయానికి మించి ఆస్తులు

## మాజీ అడిషనల్ ఎస్పీ భుజంగరావు అరెస్ట్

హైదరాబాద్,జూన్3హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి

ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ అదనపు ఎస్పీ భుజంగరావును ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఏసీబీ సోదాల్లో ఆయనకు సూర్యాపేటలో 27 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. ఐదు ఇంటి స్థలాలు, రెండు ఇళ్లు, హైదరాబాద్‌లో కమర్షియల్ భవనం, కిలో బంగారు నగలు, బ్యాంకు ఖాతాలో రూ.3.83 లక్షలున్నట్లు తేలింది. సోదాల్లో రూ.5.92 కోట్ల విలువైన సొత్తును గుర్తించారు. 29 మద్యం సీసాలు కూడా లభించడంతో ఏసీబీ అధికారులు ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చారు.

# రోడ్డు ప్రమాదంలో మధుయాష్కీ భార్యకు గాయాలు

హైదరాబాద్,జూన్3హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సతీమణి డా. సుచి అమెరికాలో జరిగిన కారు ప్రమాదంలో గాయపడ్డారు. మధుయాష్కీ దంపతులు తమ కుమార్తె డా. గగనను ఎండీ కోర్సులో చేర్పించి వేర్వేరు కార్లలో న్యూయార్క్‌కు వెళ్తుండగా డా. సుచి ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. వర్షం కారణంగా కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో ఆమెకు పక్కటెముకలు విరిగాయని, ప్రస్తుతం చికిత్స పొందుతూ కోలుకుంటున్నారని కుటుంబసభ్యులు వెల్లడించారు.

# హరీష్ రావు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 03:**

తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు జన్మదినోత్సవం సందర్భంగా కీసరలో నిర్వహించిన వేడుకల్లో బీఆర్ఎస్ నాయకుడు, ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డితో కలిసి మాద్రి పృథ్వీరాజ్ హాజరై హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రావు ప్రజా సేవలో అందిస్తున్న సేవలను కొనియాడుతూ, ఆయన నాయకత్వం తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే నాయకుడిగా హరీష్ రావు నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, చింత ప్రభాకర్‌తో పాటు హరీష్ రావు అభిమానులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.హరీష్ రావు మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.





# హరీష్ రావు జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

వృద్ధాశ్రమంలో అన్నదానం
కేక్ కట్ చేసి శుభాకాంక్షలు
శిరీష మెమోరియల్ ట్రస్టులో ఘనంగా అన్నదాన కార్యక్రమం
అనాథాశ్రమ విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ
కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు
పెద్ద సంఖ్యలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు
తెలంగాణ అభివృద్ధిలో హరీష్ రావు సేవలు విశేషం
సుదీర్ఘ ప్రజాసేవ కొనసాగాలని ఆకాంక్ష
పటాన్‌చెరు వ్యాప్తంగా ఘనంగా జన్మదిన వేడుకలు
సామాజిక సేవతో హరీష్ రావు జన్మదినోత్సవం





**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 04:**

పటాన్‌చెరు నియోజకవర్గంలో ఘనంగా మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు పటాన్‌చెరు, జూన్ 3: తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, శాసనసభ ఉపనేత తన్నీరు హరీష్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ వి. ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో అమీన్‌పూర్‌లోని వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ రావు ప్రజాసేవలను కొనియాడుతూ.. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో శివానగర్ పరిధిలోని శిరీష మెమోరియల్ చారిటబుల్ ట్రస్టులో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పరమేష్ యాదవ్ అమీన్‌పూర్‌లోని మహిమ మినిస్ట్రీస్ అనాథాశ్రమంలో విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి పంపిణీ చేసి, కేక్ కట్ చేసి హరీష్ రావు జన్మదిన వేడుకలను నిర్వహించారు. అంతకుముందు కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అమీన్‌పూర్ మాజీ చైర్మన్ పాండురంగ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జ్ రవి కిరణ్, ఉపేందర్ రెడ్డి, జగదీశ్వర్, బిజిలిపురం రాజు, తలారి రాములు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిలో హరీష్ రావు పాత్ర విశేషమని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

# సంస్థాన్ నారాయణపురం మేళ్ల చెరువు లో అక్రమ ఇసుక రవాణా...!!

**సంస్థాన్ నారాయణపురం, జూన్ 03(హైదరాబాద్ మిర్రర్):**







యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో లోని మేళ్ల చెరువు లొ అక్రమ ఇసుకరవాణా వ్యాపారం జోరుగా సాగుతోంది. పట్టపగలే ఇసుక ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్నారు. మేళ్ల చెరువు నుండి ఇసుకను పరిసర ప్రాంతాల్లో డంపింగ్ యార్డును ఏర్పాటు చేసుకొని అక్కడి నుంచి ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇట్టి ఇసుకను రాత్రి సమయాల్లో గమ్యస్థానాలకు చెరవేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అనుమతి లేని వాగుల నుంచి దర్జాగా తోడేస్తున్నా అడిగేవారు లేకపోవడంతో అడ్డూఅదుపు లేకుండా జోరుగా ఇసుక దందా నడుస్తోంది. నిబంధనలకు పాతరేసి వాగులను లూటీ చేస్తునారు. ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ అవసరాల కోసమంటూ సాకులు చెబుతూ తప్పించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఎలాంటి నిర్మాణాలు జరుగకపోయినా పట్టపగలే పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో కర్షియల్ నిర్మాణాలకు ఇసుక తరలిపోతున్నది. అయితే ట్రిప్పు లెక్కన వేలకు వేల రేట్ ఫిక్స్ చేసి వసూలు చేస్తునారు. ఇవన్నీ బహిరంగంగా తెలిసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

# తెలంగాణ ఏర్పాటుపై ఎందుకీ అక్కసు

రాష్ట్ర ఏర్పాటుతో 11 రోజులు అనసం తినలేదన్నావ్
మా ఇంటికి వస్తే సోదరుడిగా ఆదరిస్తా..బిర్యానీ పెడతా
మా సచివాలయంలో వేలు పెడతానంటే ఊరుకుంటామా
పవన్ కళ్యాణ్‌కు కెటిఆర్ ఘాటు హెచ్చరిక

**హైదరాబాద్,జూన్3హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి**

తెలంగాణ కచ్చితంగా ఇక్కడి భూమి పుత్రుల జాగీరే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌ను గౌరవిస్తామని.. సోదరుడిగా ఇంటికి వస్తే.. హైదరాబాద్ బిర్యానీ పెడతామన్నారు. అంతే కానీ.. తమ సచివాలయంలో కూర్చుంటామంటే కుదరదన్నారు. ఈ మేరకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో జనసేన కొత్తగా చేసేదేముందని కేటీఆర్ అన్నారు. దేశభక్తి గురించి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. 2023 ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేసిందని గుర్తుచేశారు. 2018లో చంద్రబాబు కూడా పోటీ చేశారని తెలిపారు. 'పవన్.. తెలంగాణలో పోటీ చేయండి.. ఎవరు వద్దంటున్నారు. ఇక్కడకు వచ్చి అనాయాసంగా మాట్లాడటం సరికాదు. నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కదం తొక్కిన నేల ఇది. ఆవిర్భావ దినోత్సవం రోజు విభజన తీరు సరిగా లేదని అంటున్నారు. తెలంగాణపై ఉల్టాపల్టా మాటలెందుకు? తెలంగాణ ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదని చెప్పారు. తెలంగాణ ఆవిర్భావం రోజు పవన్ సభ పెడతానంటే ఎలా. పవన్ మీటింగ్‌ను అడ్డుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం' అని తెలిపారు. తెలంగాణకు దిక్సూచి కేసీఆర్ అని.. వేరే ఎవరూ అవసరం లేదన్నారు. 'పవన్ కళ్యాణ్.. మీరు ఇక్కడకి రండి.. మీ కుటుంబాలు, వ్యాపారాలు ఇక్కడే ఉన్నాయి. ప్రాంతాలుగా విడిపోయినా.. ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నాం. ప్రాంతీయవాదం ఉగ్రవాదంతో సమానమని పవన్ అన్నారు. మద్రాసు నుంచి ఆంధ్ర వేరు పడాలని పొట్టి శ్రీరాములు పోరాడారు. అది కూడా ప్రాంతీయవాదమే అంటారా? మోదీ తన ప్రాంతీయవాదంతో.. తెలంగాణకు వచ్చిన పరిశ్రమలను తరలించుకుపోతున్నారు. జాతీయవాదం ముసుగులో ఆర్థిక పాంత్రీయవాదం చేయటం సరైందేనా? దీనికి పవన్ కల్యాణ్ సమాధానం చెప్తారా' అని కేటీఆర్ ప్రశ్నించారు. వందల మంది బలిదానాల రక్తంతో తడిసిన నేల తెలంగాణ అని మాజీ మంత్రి అన్నారు. ఒకటికి రెండు సార్లు ఆలోచించి పవన్ మాట్లాడాలని హితవుపలికారు. ఈ దేశంలో ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయొచ్చని తెలిపారు. ఎక్కడైతే పోటీ చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంత ప్రజల మనోభావాలు తెలుసుకోవాలని కేటీఆర్ సూచించారు. పోరాటాలు, త్యాగాలు, బలిదానాలతో తెలంగాణ సాకారమైందని కేటీఆర్ అన్నారు.1956లో బలవంతంగా ఆంధ్ర, తెలంగాణను కలిపింది కాంగ్రెస్ అని విమర్శించారు.1969 ఉద్యమంలో 379 మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమాలను కర్కశంగా అణిచివేసింది కాంగ్రెస్ అని విరుచుకుపడ్డారు. మలిదశ ఉద్యమంలో వేలాది మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని అన్నారు.

# రష్యా పర్యటనలో పెట్టుబడుల వేట

పలు సంస్థల ప్రతినిధులతో లోకేశ్ భేటీ
కెమికల్ సంస్థ రస్‌కెమ్ గ్రూపు సిఇవోతో చర్చలు
రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్ ప్రతినిధులతో సమాలోచనలు

**మాస్కో,జూన్3హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి**

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి లోకేష్, మాస్కోలో కీలక సమావేశం నిర్వహించారు. రష్యాలో గ్యాస్ ఫీల్డ్స్, మిథనాల్ కెమికల్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థ రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్, అంతర్జాతీయ వ్యాపార విభాగాధిపతి దర్యా అషానియాలతో ఆయన భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, పలు కీలక ప్రతిపాదనలను వారి ముందుంచారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ భారత్ దిగుమతి చేసుకునే పెట్రోకెమికల్స్, స్పెషాలిటీ కెమికల్స్‌ను ప్రాసెస్ చేసేందుకు వీలుగా, భారత తూర్పు తీరంలోని విశాఖ-కాకినాడ పీసీపీఐఆర్ పరిధిలో రస్ కెమ్ ఆధ్వర్యంలో ఒక అత్యాధునిక ప్రాసెసింగ్ ఎ÷-లాంట్ ఏర్పాటు చేయండని ఆహ్వానించారు. పోర్టు ఆధారిత కెమికల్ లాజిస్టిక్స్ హబ్‌ల నిర్మాణం, బల్క్ కెమికల్ స్టోరేజీ వసతులు, ప్రత్యేక వాటర్ ఫ్రంట్ బెర్త్‌ల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అంతేకాకుండా, ఏపీలో అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని ఒక కొలాబరేటివ్ పాలిమర్ అప్లికేషన్, మెటీరియల్ సైన్స్ పరిశోధన కేంద్రాన్ని స్థాపించాలని సూచించారు. రస్ కెమ్ టెక్నాలజీతో పునరుత్పాదక ఇంధన కారిడార్లను అనుసంధానిస్తూ, తక్కువ కర్బన ఉద్గారాలు వెలువరించే రసాయనాల తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో ప్రత్యేక ఎస్పీవీల ద్వారా హోల్‌సేల్ కెమికల్ పంపిణీ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థలతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని, ఇప్పటికే ముంబై, కాన్పూర్‌లలోని పంపిణీ కేంద్రాల ద్వారా పరిశ్రమలకు అవసరమైన రసాయనాలను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ సరఫరా కేంద్రం ద్వారా విశాఖపట్నం, కాకినాడలోని ఫార్మా, తయారీ పరిశ్రమలకు కీలక రసాయనాలను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత్‌లోని భారీ పెట్రోకెమికల్ ఎ÷-లాంట్లను ఉపయోగించుకుని తమ గ్లోబల్ ఖాతాదారులకు స్థిరమైన సరఫరా అందిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలు ఆశాజనకంగా ఉన్నాయని, వీటిపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని ఇల్యా కోసిహ్ తెలిపారు.అలాగే రష్యా ప్రభుత్వ నియంత్రిత ప్రముఖ రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్‌తో నారా లోకేశ్ మాస్కోలో భేటీ అయ్యారు. వెస్టర్న్ ఎ÷-లాట్‌ఫామ్‌లకు సురక్షితమైన లోకలైజ్డ్ జనరేటివ్ ఏఐ ప్రత్యామ్నాయ వ్యవస్థను అందించిన తరహాలోనే భారతదేశంలో బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు స్బేర్ బ్యాంక్ గిగాచాట్ ఎల్ఎల్ఎంను విస్తరించాలని నారా లోకేశ్ కోరారు. జాతీయ యూన్గి÷డ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ నెట్‌వర్క్ భద్రతను పటిష్ఠం చేస్తూ, స్బేర్‌బ్యాంక్ అడ్వాన్స్‌డ్ వాయిస్ రికగ్నిషన్, బయోమెట్రిక్ యాంటీ-ఫ్రాడ్ నెట్‌వర్క్‌ను భారతదేశ బ్యాంకింగ్ మౌలిక సదుపాయాల్లో ఇంటిగ్రేట్ చేసేలా సాంకేతిక సహకారం అందించాలన్నారు.

# మలేషియాలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## ఏర్పాట్లను పరిశీలించిన గాదరి కిశోర్, గ్యాదరి బాలమల్లు





ఉమ్మడి నల్గొండ , జూన్ 03(హైదరాబాద్ మిర్రర్):

మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో జూన్ 6, 2026న నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బిఆర్ఎస్ మలేషియా, మైటా సంయుక్త ఆధ్వర్యంలో కౌలాలంపూర్‌లోని ప్రసిద్ధ ‘మాట్రేడ్ ఎగ్జిబిషన్ అండ్ కన్వెన్షన్ సెంటర్‘లో ఈ ఉత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో కౌలాలంపూర్‌లో జరుగుతున్న ఏర్పాట్లను తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్ కుమార్, బి ఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు బుధవారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వేడుకల సన్నాహాలపై మలేషియా బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు, మైటా ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. మలేషియా దేశంలో మొదటిసారిగా ఇంత పెద్ద ఎత్తున తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నందున, స్థానికంగా ఉండే తెలంగాణ ప్రజలందరూ పెద్ద మొత్తంలో హాజరై ఈ వేడుకలను ఘనంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రవాసంలో ఉన్నప్పటికీ మన సంస్కృతి, అస్తిత్వాన్ని చాటేలా ఈ కార్యక్రమం నిలవాలని వారు ఆకాంక్షించారు. ఈ ఏర్పాట్ల సమీక్షా కార్యక్రమంలో బి ఆర్ ఎస్ గ్లోబల్ ఎన్ ఆర్ ఐ నాయకులు సురకంటి శ్రీనివాస్, మైట అధ్యక్షుడు ఎస్. తిరుపతి, మహిళా అధ్యక్షురాలు కిరణ్మయి, బి ఆర్ ఎస్ మలేషియా అధ్యక్షుడు మారుతి, బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ఉపేందర్ గౌడ్, పడాల సతీష్ పాల్గొన్నారు. వీరితో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు మన్సూర్, సంతోష్, సందీప్, జ్యోతి, మౌనిక, సుప్రియ, శశి, శివ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

గండిపేట్ :. హైదరాబాద్ మిర్రర్

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను ఎలాంటి నిబంధనలు లేకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యాలయం ఏఆర్ దేవరాజ్ భవన్‌లో భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాజేంద్రనగర్ మండల నిర్మాణ మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల కార్యదర్శి కన్యగారి లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ కోసం గీతా ముఖర్జీ తదితరులు చేసిన పోరాటాల ఫలితంగానే మహిళా రిజర్వేషన్ బిల్లు రూపుదిద్దుకుందని తెలిపారు. అయితే కేంద్ర ప్రభుత్వం వివిధ కుంటి సాకులు చెబుతూ మహిళా రిజర్వేషన్ అమలును వాయిదా వేస్తోందని విమర్శించారు. మహిళలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ మండల మహిళా సమాఖ్య కమిటీ యథావిధిగా కొనసాగుతుందని ప్రకటించారు. కమిటీ అధ్యక్షురాలిగా కే. మునేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా కన్యగారి లక్ష్మి, సహాయ కార్యదర్శులుగా కే. వాణి, ఎం. సుగుణ, మౌనిక, ఉపాధ్యక్షులుగా సయ్యద్ రేష్మా, శాంతమ్మ, జ్యోతి, కార్యవర్గ సభ్యులుగా వి. సునీత, వి. సుమలత, కందారి భారతమ్మ, ఎం. సరూప, పద్మా గౌడ్, కే. శారద, జి. రాములమ్మ, ఊర్మిళ, సుజాత, వనమ్మ తదితరులు కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యాలయ కార్యదర్శి జి. సత్యం, సహాయ కార్యదర్శి దర్శనాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.









# ప్రమాదం నుంచి ప్రాణాపాయం వరకు..

# వైద్యుల పోరాటంతో స్ట్రోక్‌ను జయించిన యువకుడు

### - చిన్న గాయాన్ని నిర్లక్ష్యం చేయొద్దు - సకాలంలో చికిత్స అందితే స్ట్రోక్‌పై విజయం సాధించవచ్చని నిరూపించిన మెడికవర్ వైద్యులు





గండిపేట్ :. హైదరాబాద్ మిర్రర్

సాధారణంగా కనిపించిన ఒక చిన్న స్కూటీ ప్రమాదం ఓ యువకుడిని ప్రాణాపాయ స్థితికి నెట్టింది. అయితే వైద్యుల అప్రమత్తత, అత్యాధునిక వైద్యం, సకాలంలో తీసుకున్న నిర్ణయాలతో అతడు స్ట్రోక్‌ను జయించి తిరిగి సాధారణ జీవితంలోకి అడుగుపెట్టిన ఘటన స్ఫూర్తిదాయకంగా నిలిచింది. పగటి సమయంలో జరిగిన స్కూటీ ప్రమాదంలో మిర్రర్ మెడను బలంగా తాకినా పెద్దగా గాయమేమీ కాలేదని భావించిన యువకుడు ఇంటికి వెళ్లిపోయాడు. కానీ అర్ధరాత్రి ఒక్కసారిగా శరీరం కుడి భాగం పనిచేయకపోవడం, మాట తడబడటం, పక్షవాతం లక్షణాలు కనిపించడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే మెడికవర్ హాస్పిటల్స్‌కు తరలించగా వైద్యులు వేగంగా స్పందించి పరీక్షలు నిర్వహించారు. ప్రమాదంలో మెడలోని ప్రధాన రక్తనాళం దెబ్బతినడం వల్ల రక్తం గడ్డకట్టి స్ట్రోక్ వచ్చినట్లు గుర్తించారు. అత్యవసర చికిత్స ద్వారా రక్తగడ్డను తొలగించి, స్టెంట్లు అమర్చి రక్తప్రసరణను పునరుద్ధరించారు. వైద్యుల సమిష్టి కృషి ఫలితంగా మరుసటి రోజే రోగి నడవగలిగాడు. మాట్లాడే సామర్థ్యం కూడా తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఘటన చిన్న గాయాన్ని కూడా నిర్లక్ష్యం చేయకూడదనే సందేశాన్ని సమాజానికి అందిస్తోంది. ప్రమాదం తర్వాత శరీరంలో ఏవైనా అసాధారణ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. సమయానికి తీసుకున్న నిర్ణయం, వైద్యుల నిబద్ధత, ఆధునిక వైద్య సాంకేతికత కలిస్తే ఎంతటి ప్రమాదకర పరిస్థితినైనా అధిగమించవచ్చని ఈ సంఘటన మరోసారి నిరూపించింది.

# తెలంగాణ పోలీస్ అకాడమీని సందర్శించిన డీజీపీ సి.వి. ఆనంద్



గండిపేట్ :. హైదరాబాద్ మిర్రర్





తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ అధిపతి (డీజీపీ)గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సి.వి. ఆనంద్ తెలంగాణ పోలీస్ అకాడమీని సందర్శించారు. అకాడమీకి చేరుకున్న డీజీపీకి అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్ స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన ఆయన, అకాడమీలోని ఆసుపత్రి, పరిపాలనా విభాగం, సభా మందిరం, తరగతి గదులు, భోజనశాలలు, క్రీడా భవనం, తుపాకీ శిక్షణ కేంద్రం, పరేడ్ మైదానాలు తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం జరిగిన సమీక్ష సమావేశంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్, కొత్తగా నియమితులయ్యే సిబ్బందికి అందిస్తున్న శిక్షణ, విధుల్లో ఉన్న సిబ్బందికి నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, మౌలిక వసతులు, సదస్సులు, శిక్షణ శిబిరాలు, సంక్షేమ కార్యక్రమాలు మరియు అకాడమీ ఎదుర్కొంటున్న సవాళ్లపై వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, తెలంగాణ పోలీస్ అకాడమీ దేశంలోని ఉత్తమ పోలీసు శిక్షణా సంస్థల్లో ఒకటిగా నిలిచిందని ప్రశంసించారు. నాణ్యమైన శిక్షణ అందించేందుకు అధికారులు, సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలోని పోలీసు శిక్షణ కళాశాలలు, జిల్లా శిక్షణ కేంద్రాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణా కార్యక్రమాలకు అవసరమైన మౌలిక వసతులు, అనుమతులు మరియు ఇతర అవసరాలకు ప్రధాన కార్యాలయం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల దర్యాప్తు, రోడ్డు భద్రత, మోటారు వాహనాల చట్టం అమలు, ప్రజల్లో అవగాహన కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మహిళా పోలీసు సిబ్బంది సంక్షేమం, సమాన అవకాశాలు మరియు సంస్థాగత సంస్కరణల కోసం ప్రతి ఏడాది మహిళా పోలీసు సదస్సు నిర్వహించాలని సూచించారు.



# నేడు పెద్ది మూవీ విడుదల
# చరణ్‌కు పవన్ శుభాకాంక్షలు

రామ్ చరణ్ అభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూసిన రోజు వచ్చేసింది. మరికొన్ని గంటల్లో ప్రీమియర్లతో.. 'పెద్ది' థియేటర్‌లలో సందడి చేయనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ సెలబ్రిటీలు విషెస్ చెబుతున్నారు. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 'పెద్ది' టీమ్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ మేరకు తన సొంత నిర్మాణ సంస్థ 'పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్' సోషల్ మీడియా ఖాతాలో ఓ వీడియో పోస్ట్ చేశారు. దీనిపై స్పందించిన రామ్ చరణ్ .. పవన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొండగట్టు ఆంజనేయ స్వామి ఆశీస్సులతో 'పెద్ది' సినిమా అన్ని ఆటంకాలను దాటుకొని విజయం సాధించాలని పవన్ ఆకాంక్షించారు. చిన్నప్పుడు రామ్ చరణ్‌ను ఆయన ఆశీర్వదిస్తున్న ఫొటోతో ప్రారంభమైన ఓ వీడియోను 'పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్' షేర్ చేసింది. ఈ వీడియోను రీ షేర్ చేసిన చరణ్.. 'మీ మాటలు నాకు, పెద్ది టీమ్‌కు ఎంతో విలువైనవి. మాపై మీకున్న ప్రేమ, మద్దతుకు కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు. మరోవైపు, పవన్ సతీమణి అన్నా కొణిదెల కూడా 'పెద్ది' టీమ్‌కు విషెస్ చెప్పారు. ఈ మూవీ ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సినిమా మొత్తానికి దిల్లీ ఎపిసోడ్ హైలైట్‌గా నిలుస్తుందని మొదటి నుంచీ టీమ్ చెబుతూనే ఉంది. తాజాగా కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ పోస్ట్ పెట్టారు.

# సిఎం విజయ్‌తో ఖుష్బూ సుందర్ కుటుంబం భేటీ
## కుమార్తె అవంతిక పెళ్లికి ఆహ్వానం అందచేత

ప్రముఖ నటి, బీజేపీ నాయకురాలు ఖుష్బూ సుందర్, ఆమె భర్త, ప్రముఖ సినీ దర్శకుడు సుందర్ సి. తమ కుమార్తె అవంతిక వివాహ వేడుకకు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను వ్యక్తిగతంగా కలిసి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి విజయ్ నివాసానికి వెళ్లిన ఖుష్బూ దంపతులు, తమ కుమార్తె అవంతిక, కాబోయే అల్లుడు శ్రవణ్ శ్రీనివాసన్ ల వివాహ పత్రికను ఆయనకు అందజేసి ఆశీస్సులు కోరారు. ఈ ప్రత్యేక కలయికకు సంబంధించిన వివరాలను, ఫోటోలను ఖుష్బూ సుందర్ తన సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ రోజు తమ కుటుంబానికి ఎంతో ప్రత్యేకమైనది అని పేర్కొన్న ఖుష్బూ.. ముఖ్యమంత్రి విజయ్‌ను తన ప్రియమైన సోదరుడిగా అభివర్ణించింది. విజయ్‌ను చూడటం ఎల్లప్పుడూ ఉంటుందని. తమ పిల్లలు కూడా విజయ్‌ను చూసి ఎంతో ఆనందించారని, ఆయన ఎంత బిజీ షెడ్యూల్‌లో ఉన్నప్పటికీ ఎప్పటిలాగే ఎంతో ఆప్యాయతతో, చిరునవ్వుతో తమను స్వాగతించారని ఆమె రాసుకొచ్చింది. ఈ సందర్భంగా తమకు ఎంతో విలువైన సమయాన్ని కేటాయించి, ప్రేమను, ఆశీస్సులను అందించినం దుకు ముఖ్యమంత్రి విజయ్‌కు ఖుష్బూ తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. గతంలో సినీ రంగంలో కలిసి ప్రయాణించిన వీరిద్దరి మధ్య ఉన్న ఆత్మీయ బంధం, విజయ్ ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పటికీ అలాగే కొనసాగడం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఖుష్బూ కుటుంబం విజయ్‌తో దిగిన ఈ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.



# రామ్‌చరణ్ ఖాతాలో
# పెద్ది విజయం పడేనా
## బుచ్చిబాబు సెంటిమెంట్‌ను బద్దలు కొట్టేనా

సంక్రాంతి తర్వాత తెలుగు సినీ పరిశ్రమ ఓ మంచి విజయవంతమైన చిత్రం కోసం ఎదురుచూస్తోంది. మరి రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన 'పెద్ది' ఆ లోటును భర్తీ చేస్తుందా అని ఇప్పుడు అంతా ఎదురు చూస్తున్నారు. 'పెద్ది' సక్సెస్ అందరికన్నా రామ్‌చరణ్‌కు చాలా ముఖ్యం. ఎందుకంటే 'రంగస్థలం' తర్వాత ఆ స్థాయి నటన, విజయం అందించిన చిత్రమేదీ ఆయన నుంచి రాలేదు. 'వినయ విధేయ రామ', 'ఆచార్య', 'గేమ్ ఛేంజర్' అన్నీ చేదు అనుభవాన్ని ఇచ్చినవే. మధ్యలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్' చరణ్‌ను గ్లోబల్‌స్టార్ చేసినా అది రాజమౌళి, ఎన్టీఆర్‌లతో కలిసి షేర్ చేసుకునే విజయమే అవుతుంది. ఈ క్రమంలో చరణ్ ఆశలన్నీ 'పెద్ది' పైనే. 'మస్స మస్స' సాంగ్ చూస్తేనే అర్థమవుతోంది ఈ మూవీ కోసం చరణ్ ఎంత కష్టపడ్డారో. 'ఇలాంటి కథ కోసం కాకపోతే ఇంకెప్పుడు కష్టపడతా'మని కూడా చెప్పారు. చెర్రీకి 'పెద్ది'పై ఉన్న నమ్మకం అలాంటిది. ఇప్పటికే సుకుమార్‌తో మూవీ ప్రకటించారు. ఎంతలేదన్నా ఈ మూవీ రావడానికి కనీసం ఏడాది నుంచి రెండేళ్ల సమయం పడుతుంది. దీంతో చరణ్ హిట్ కొట్టక తప్పని పరిస్థితి.తెలుగు సినీ ఇండస్ట్రీలో దర్శకులను ద్వితీయ విఘ్నం వెంటాడుతూనే ఉంటుంది. ఫస్ట్ మూవీ హిట్ కొట్టి, రెండో మూవీ ఫ్లాప్ అందుకున్న దర్శకులు చాలామందే ఉన్నారు. దాన్ని బద్దలు కొట్టి విజయాన్ని అందుకున్నవారు తక్కువ. 'ఉప్పెన'తో బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించడమే కాదు, అవార్డులను కొల్లగొట్టారు బుచ్చిబాబు. దాదాపు ఐదేళ్లుగా 'పెద్ది' కథతో ప్రయాణం చేసి, ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇండస్ట్రీ సెంటిమెంట్‌ను బద్దలు కొట్టడానికి ఈ విజయం బుచ్చిబాబుకు తప్పనిసరి. శ్రీదేవి తనయగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినా, ఇప్పటివరకూ బ్లాక్‌బస్టర్ విజయం మాత్రం జాన్వీకపూర్ ను వరించలేదు. తెలుగులో 'దేవర'తో ఎంట్రీ ఇచ్చినా, ఆ పాత్రకు పెద్ద గుర్తింపు రాలేదు. ఇప్పుడు పెద్దిలో 'అచ్చియ్యమ్మ'గా ఆమె కనిపించనున్నారు. జాన్వీ కారణంగానే ఈ మూవీకి కళ వచ్చిందని ఇప్పటికే బుచ్చిబాబు చెప్పారు. మరి జాన్వీ కెరీర్‌కు 'పెద్ది' టర్నింగ్ పాయింట్ కావాల్సిందే. ఏఆర్ రెహమాన్.. ఆస్కార్‌ను సైతం అందుకున్న గొప్ప సంగీత దర్శకుడు. తమిళ, హిందీ భాషల్లో ఆయన అందించిన సంగీతం, పాటలు తెలుగు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కానీ, తెలుగులో ఆయన నేరుగా చేసిన సినిమాలేవీ మ్యూజిక్‌పరంగా మెప్పించలేకపోయాయి. 'చికిరి' సాంగ్‌తో ఆ అనుమానాలను పటాపంచలు చేశారు. ఆ తర్వాత 'రయ్ రయ్ రారా', 'హల్లో హల్లల్లో' అలరించాయి. ఇక 'మస్స మస్స' ఆ అంచనాలను పెంచింది. వీటన్నింటికన్నా అసలు చూడాల్సింది నేపథ్య సంగీతం. స్పోర్ట్స్ డ్రామా, బలమైన భావోద్వేగాలు కలిగిన ఇందులోని సన్నివేశాలు ఎలివేట్ కావాలంటే అందుకు సంగీతం వారధి అవుతుంది. వీరే కాదు, గౌర్నాయుడు పాత్రపై శివరాజ్‌కుమార్, అప్పలసూరి పాత్రపై జగపతిబాబు, రామ్ బుచ్చి పాత్రపై దివ్యేందు చాలా ఆశలే పెట్టుకున్నారు.




# డాన్ -3 వివాదానికి తాత్కాలిక తెర
# రణ్‌వీర్ లీగల్ నోటీసులు..
# నిషేధం ఎత్తివేసిన నిర్మాణ సంస్థ




బాలీవుడ్‌లో చర్చనీయాంశమైన 'డాన్ 3' వివాదం రోజురోజుకూ ముదురుతోంది. తాజాగా ఈ వివాదం కోర్టు మెట్లెక్కింది. తనపై నిషేధం విధించిన ఎఫ్‌డబ్ల్యూఐసీఈ సంస్థకు మంగళవారం రణ్‌వీర్ లీగల్ నోటీసులు పంపారు. మరోవైపు తమకు నోటీసులు అందినట్లు ఎఫ్‌డబ్ల్యూఐసీఈ చీఫ్ అడ్వైజర్, ఫిల్మ్‌మేకర్ అశోక్ పండిట్ ధ్రువీకరించారు. బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత ఫర్హాన్ అక్తర్ తెరకెక్కించాలనుకున్న 'డాన్ 3' సినిమా నుంచి రణ్‌వీర్ మధ్యలో వైదొలిగారు. ఈ క్రమంలో.. రణ్‌వీర్ చర్చలకు సహకరించలేదని, నిర్మాతలు నష్టపోయిన రూ.45 కోట్ల ప్రీ ప్రొడక్షన్ నష్టపరిహారం విషయంలో నిర్మాణ సంస్థతో ఉన్న వివాదాన్ని పరిష్కరించుకునే వరకూ ఆయనతో కలిసి పని చేయవద్దని ఆదేశిస్తూ ఎఫ్‌డబ్ల్యూఐసీఈ ప్రకటన జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై నటుడి టీమ్ స్పందిస్తూ.. ఆయనకు వృత్తిపై అపారమైన గౌరవం ఉందని తెలిపింది. సినిమా హిట్ కావాలని కోరుకుంటారని అందుకే ఈ వివాదంపై మౌనంగా ఉంటున్నారని వెల్లడించింది. ఈక్రమంలో బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్‌కు పెద్ద ఉపశమనం లభించింది. ఆయనపై విధించిన నాన్-కోఆపరేషన్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్ బుధవారం ప్రకటించింది. ఫర్హాన్ అక్తర్ సినిమా 'డాన్ 3' నుండి రణవీర్ తప్పుకోవడంతో ఈ వివాదం మొదలైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రణవీర్ సింగ్ సదరు సంస్థకు లీగల్ నోటీసు పంపిన కొద్ది గంటల్లోనే ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ , ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, మరియు సినీ / టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ లు ఈ గొడవలో జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగినట్లు తెలుస్తుంది. ఈ విషయంపై ప్రెసిడెంట్ బి.ఎన్. తివారీ మాట్లాడుతూ.. సినీ అసోసియేషన్ల అభ్యర్థన మేరకు రణవీర్ సింగ్‌పై ఉన్న నాన్-కోఆపరేషన్ ఆదేశాలను వెంటనే రద్దు చేస్తున్నాం. నిర్మాతలు, దర్శకులు లేదా నటులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అందరం కలిసి కూర్చుని మాట్లాడుకుంటాం. ఈ గొడవలో ఎవరూ గెలవలేదు, ఎవరూ ఓడిపోలేదు.

# ఇరుమడి తాజా గ్లింప్స్ విడుదల




మాస్ మహారాజా రవితేజ, డైరెక్టర్ శివ నిర్వాణ కాంబినేషన్‌లో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిత్రం 'ఇరుముడి'. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్ వీడియో 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి'ని చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ గ్లింప్స్ చూస్తుంటే.. తండ్రీకూతుళ్ల మధ్య ఉండే బలమైన ఎమోషనల్ బాండింగ్ చుట్టూ కథ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. తాగుడికి బానిసైన తండ్రి ఆ వ్యసనానికి దూరమవ్వడం కోసం అయ్యప్ప మాలా వేసిన అనంతరం జరిగిన సంఘటనలు ఏంటి అనేది ఈ సినిమా కథ. అయ్యప్ప స్వామి భక్తి, అయ్యప్ప మాల నేపథ్యంతో పాటు హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లు, ఆధ్యాత్మికత, ఫ్యామిలీ ఎమోషన్స్ సమానంగా ఉండేలా రవితేజను ఒక సరికొత్త రిఫ్రెషింగ్ అవతార్‌లో చూపించబోతున్నాడు శివ నిర్వాణ. ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రవితేజ కుమార్తెగా బేబీ నక్షత్ర, ఇతర కీలక పాత్రల్లో సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, స్వాసిక నటిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి విష్ణు శర్మ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం చివరి దశ షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా వేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని జులై లేదా ఆగస్టు 2026లో భారీ స్థాయిలో విడుదల చేయడానికి చిత్రబృందం ప్లాన్ చేస్తోంది.

Printed, published and edited by Makam Gangadhar H. No. 11-5-565, Bhagyalaxmi Towers, Venkateswara Colony, saroornagar, Ranga Reddy Dist. 500 035. T. GOwened by Makam Gangadhar and Printed at Ratna Graphics, H. No. 2-3-703/7, Tirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500013 T. G.H. No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Rangareddy Dist. 500 035. T. G. Editor & Managing Director : Makam Gangadhar +919393446188, PRGI No. TGTEL/2026/A1889